నమస్తే తెలంగాణ
మెదక్

I | హైదరాబాద్, బుధవారం 4 జూన్ 2025 | MEDAK

తూప్రాన్: హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా తూప్రాన్‌లో సాయిబాబా ట్రస్ట్‌లో పూజలు నిర్వహిస్తున్న మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ

మాదాసు మంచి మనసు

- అనాథ చిన్నారులకు చేయూత

గజ్వేల్, జూన్ 3: గజ్వేల్ మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అనాథ పిల్లలకు సాయం చేసి ఉదారత చాటుకున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ సమీపంలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీ పల్లెపహాడ్‌కు చెందిన గూడూరు పద్మ అనారోగ్యంతో ఏడాది క్రితం మృతిచెందింది. రెండు రోజుల కింద తండ్రి రమేశ్ మృతిచెందడంతో వారి పిల్లలు పవన్ తేజ్, వరుణ్ తేజ్ అనాథలయ్యారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు 53వ జన్మదినం సందర్భంగా ఈ అనాథ చిన్నారులకు రూ.53 వేల ఆర్థిక సాయాన్ని, నిత్యావసరాలను మంగళవారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా మాదాసు శ్రీనివాస్ అందజేశారు. మాదాసు శ్రీనివాస్‌ను డాక్టర్ యాదవరెడ్డి,వంటేరు ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

చిన్నారులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాదాసు శ్రీనివాస్

అదనపు గదులకు ప్రతిపాదనలు పంపాలి

మాట్లాడుతున్న కలెక్టర్

సిద్దిపేట, జూన్ 3: ప్రభుత్వ పాఠశాలల్లో మైనర్ రిపేర్లు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని సిద్దిపేట కలెక్టర్ ఎం. మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, ఈడబ్ల్యూఐడీసీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణ పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యి బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. పెండింగ్ బిల్లుల వివరాలను త్వరగా ఎంబీ రికార్డు చేసి అందించాలన్నారు. సమీక్షలో డీఈవో శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, పీఆర్ ఈఈలు, ఏఈలు, ఈడబ్ల్యూఐడీసీ ఏఈలు పాల్గొన్నారు.



తూప్రాన్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కేసరి హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి

- మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

గజ్వేల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

గజ్వేల్, జూన్ 3: ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించి నిలబెట్టుకోవాలని ప్రజలకు తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతను మంగళవారం గజ్వేల్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులు నిలబడాలి.. చదువుల్లో అంతరాలు పోవాలనే నినాదంతో ఈ ప్రచార జాతను చేపట్టినట్లు తెలిపారు. ఉన్నోడి పిల్లలైనా లేనోడి పిల్లలైనా ఒకే బడిలో, కళాశాలలో, యూనివర్సిటీలో చదువుకునేలా ప్రజలు ఆలోచన చేయాలని, రాజకీయ నాయకులు ఆ వైపుగా చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యధిక మంది తల్లిదండ్రులు మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్యలోని పిల్లల్ని ప్రైవేటులో చేర్పిస్తున్నారని, గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అతి తక్కువ మంది చేర్పిస్తున్నట్లు తెలిపారు. అందుకు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వలీ అహ్మద్, నాయకులు చంద్రారెడ్డి, సత్యనారాయణ, మంగ పాల్గొన్నారు.

'మల్లన్న' క్షేత్రంలో భూఆక్రమణకు స్కెచ్

జేసీబీతో చిన్న గుళ్లను తొలిగిస్తున్న ఆలయ వర్గాలు

చేర్యాల, జూన్ 3: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న క్షేత్ర ఆవరణలోని ఖాళీగా ఉన్న ఓ ప్రదేశాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు పక్కా ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు ఆలయానికి వచ్చే దారిలో ఉన్న స్వాగత తోరణం పరిసరాల్లో సోమవారం రాత్రికి రాత్రే షాబాదు బండలతో చిన్నచిన్న గుళ్లు కట్టారు. మంగళవారం ఉదయం ఆలయ అధికారులు వెంటనే రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం ఆలయ ఈవో అన్నపూర్ణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌కు విషయం తెలియజేశారు. వెంటనే కొమురవెల్లి ఎస్ఐ రాజు, సిబ్బంది సహకారంతో ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకుడు శ్రీరాములు, ప్లంబర్ విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది జేసీబీతో చిన్నచిన్న గుళ్లను తొలిగించారు.

ఆటోడ్రైవర్ అయిలయ్య

అభిమానం.. ఉచిత ఆటో ప్రయాణం

నంగునూరు, జూన్ 3: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై ఓ ఆటోవాలా వినూత్న రీతిలో అభిమానాన్ని చాటుకున్నాడు. హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం తన ఆటోలో ప్రయాణికులకు రోజంతా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి తన అభిమానాన్ని చాటుకున్నాడు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని కొండంరాజుపల్లికి చెందిన ఆటోవాలా అయిలయ్య కొండంరాజుపల్లి నుంచి సిద్దిపేట వరకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాడు.

టాటూ వేసుకున్న అభిమాని

చేతిపై హరీశ్‌రావు టాటూ వేయించున్న అభిమాని చిన్నా

సిద్దిపేట జిల్లా మండలంలోని పాలమాకులకు చెందిన పల్లపు చిన్నా (సర్వేశ్) అనే యువకుడు తన చేతిపై హరీశ్‌రావు టాటూ వేసుకొని తన అభిమానాన్ని చాటుకున్నాడు. హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా వినూత్న రీతిలో శుభాకాంక్షలు తెలియజేయాలని హరీ టాటూ వేయించున్నట్లు తెలిపారు.

వర్ధిల్లు వందేండ్లు

ఘనంగా హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలు

గ్రామగ్రామాన విస్తృతంగా సేవా కార్యక్రమాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో పండుగ వాతావరణం

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా మంగళవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకల్లో పాల్గొన్నారు. రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆలయాల్లో పూజలు చేశారు. మసీదులు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నేతలు ముందుకు వచ్చిన పదోతరగతి టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. గజ్వేల్‌లో బీఆర్ఎస్ నేత మాదాసు శ్రీనివాస్ ఇద్దరు అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం చేయగా, జహీరాబాద్‌లో బీఆర్ఎస్ నేత నామ రవి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇచ్చారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి, పేదల సంక్షేమానికి పాటుపడుతున్న హరీశ్‌రావుకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అందరూ దేవుడిని మొక్కుకున్నారు. –నమస్తే తెలంగాణ నెట్‌వర్క్(ఉమ్మడి మెదక్ జిల్లా), జూన్ 3

సిద్దిపేట: కోమటి చెరువు వద్ద కేసీఆర్, హరీశ్‌రావుల సైకత శిల్పం

గజ్వేల్‌లో అన్నదానంలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

హ్యాట్సాప్ హరీశ్ అన్న

–హరీశ్‌రావు అభిమానాన్ని చాటుకున్న ఆంధ్రావాసి

సిద్దిపేట, జూన్ 3: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు చెందిన గుళ్లపల్లి వెంకట్రామయ్య తన అభిమానాన్ని చాటుకున్నారు. అతను సిద్దిపేటలోని కోమటి చెరువు వద్ద దిగిన ఫొటోలను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. హరీశ్‌రావు చేసిన అభివృద్ధి గురించి తెలియజేశాడు. గుజరాత్ మోడల్ కాదు.. సిద్దిపేట మోడల్ అవసరం అంటూ పేర్కొన్నాడు. భవిష్యత్తు నాయకులు హరీశ్‌రావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేను ఆంధ్రా వ్యక్తిని, కానీ.. తెలంగాణ ఇంత అందంగా ఉంటుందని సిద్దిపేట చూసే వరకూ తనకు తెలియదని.. ఇక్కడ సీఎంలు, పీఎంలు ఉండరు.. హరీశ్ రావు ఒక్కడే.. హాట్సాప్ హరీశ్ అన్న.. మీకు పుట్టిన రోజు శుభాకాంక్షలు అని గుళ్లపల్లి వెంకట్రామయ్య సోషల్‌మీడియాలో స్టేటస్‌గా హరీశ్ రావు గురించి పేర్కొన్నారు.

ప్రజా నాయకుడు హరీశ్‌రావు

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి
- గజ్వేల్‌లో ఘనంగా హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలు
- రోగులకు బ్రెడ్డు పంపిణీ, అన్నదానం

గజ్వేల్, జూన్ 3: మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం గజ్వేల్‌లోని కేసరి హనుమాన్ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ప్రభుత్వ దవాఖానలో ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు ఎన్సీ సంతోష్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఇందిరా పార్కు చౌరస్తాలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ జెజాల వెంకటేశంగౌడ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జకియొద్దీన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, దయాకర్‌రెడ్డి, హైదర్‌పటేల్, అశోక్‌రావు, దేవేందర్, నర్సింగరావు, రమేష్‌గౌడ్, రాములు, మల్లేశంగౌడ్, నరేష్, కనకగౌడ్, మాజీ కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, దుర్గాప్రసాద్, చందు, కనకయ్య, అత్తెల్లి శ్రీనివాస్, రజిత, అరుణ, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, శ్రీధర్, అహ్మద్, ఉమర్, స్వామిచారి పాల్గొన్నారు.

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన కానుకగా బీఆర్ఎస్ నేత నామరవికిరణ్ నిర్మించిన ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

పాత ఇంటి దుస్థితి (ఫైల్)

నామరవికిరణ్ నిర్మించిన నూతన ఇల్లు

పేద కుటుంబానికి కానుక

- హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా పేద కుటుంబానికి గూడు సౌకర్యం

జహీరాబాద్, జూన్ 3: తన పుట్టినరోజు సందర్భంగా వేడుకలకు డబ్బులు వృథాగా ఖర్చు చేయకుండా సామాజిక సేవ చేసి నిరుపేదలను ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు జహీరాబాద్ పట్టణ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామరవికిరణ్ నిరుపేదకు ఇల్లు నిర్మించి అందజేశారు. జహీరాబాద్‌లోని బాగారెడ్డిపల్లి కాలనీలో ఉండే నిరుపేద కుటుంబానికి చెందిన వడ్డెర రాములు సరైన ఇల్లు లేదు. వీరు నివసించే గూడులో కనీస సౌకర్యం, రాత్రుళ్లు కరెంట్ లేకుండా దీపం పెట్టుకుని దీన స్థితిలో ఉంటున్నారు. వీరి పరిస్థితి చూసి చలించిన బీఆర్ఎస్ నాయకుడు నామ రవి కిరణ్ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. నామ సుబద్రమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో సొంత ఖర్చుతో అన్ని వసతులతో రాములుకు ఇంటిని నిర్మించాడు. మంగళవారం హరీశ్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకొని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు చేతుల మీదుగా ఆ ఇంటిని ప్రారంభించి ఇంటి తాళాన్ని అందజేశారు. అక్కడే హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి వడ్డెర రాములుకు తినిపించారు. అనంతరం ప్రజలకు అన్నదానం చేశారు. బీఆర్ఎస్ నాయకుడు నామ రవికిరణ్ దంపతులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అభినందించారు. మంచి కార్యక్రమం చేపట్టారని ప్రశంసించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండప్ప, మోహన్, యాకూబ్, అబ్దుల్లా, శివప్ప, అనుసమ్మ, మంజుల, పద్మజా, నరేశ్‌రెడ్డి, వెంకటేశం గుప్తా, గణేశ్, సందీప్, నిఖిల్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఉల్లంఘిస్తే చర్యలు

- రంగధాంపల్లి చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన సీపీ

సిద్దిపేట అర్బన్, జూన్ 3 : సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లా, సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. సిద్దిపేట పట్టణ పరిధిలోని రంగధాంపల్లి వద్ద పశువుల అక్రమ రవాణా నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను మంగళవారం సీపీ అనురాధ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలు తనిఖీ చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యల్లో భాగంగా పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, మత సామరస్యతో జరుపుకొనేలా అవసరమైన చోట్ల ముందస్తుగా పటిష్టమైన పోలీస్ బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. సీపీ వెంట ట్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్సీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ నేత హరీశ్‌రావు

తూప్రాన్‌లో అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాఘవేందర్ గౌడ్, బాబుల్‌రెడ్డి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

తూప్రాన్, జూన్ 3 : రాజకీయాల్లో హరీశ్‌రావును ఆదర్శంగా తీసుకోవాలని, అనుక్షణం ప్రజాసేవలో ఆయన ఉంటారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఆవరణలో మంగళవారం హరీశ్‌రావు పుట్టినరోజు వేడుకలను తూప్రాన్ మున్సిపల్ మాజీ చైర్మెన్ బొంది రాఘవేందర్ గౌడ్, మండల అధ్యక్షుడు బాబుల్ రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాణి సత్యనారాయణ గౌడ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏర్పుల లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రూ.10.11 కోట్ల మత్తు పదార్థాలు దహనం

మత్తు పదార్థాలను డిస్పోజల్ చేయడానికి తరలించిన ఎక్సైజ్ అధికారులు

సంగారెడ్డి/పటాన్‌చెరు రూరల్, జూన్ 3: సంగారెడ్డి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాల వాహన తనిఖీల్లో పట్టుబడిన మాదక ద్రవాలను ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. మంగళవారం డిస్పోజల్ అధికారి, మెదక్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ ఆధ్వర్యంలో ఇస్నాపూర్ ప్రాంతంలో మెడికేర్ వెస్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలను కాల్చి బూడిదచేశారు. ఇందులో 209.162 కిలోల గంజాయి, 7 గ్రాముల డైజోఫామ్, 0.496కిలోల ఆల్పాజోలం, 0.468 కిలోల పప్పిస్ట్రా, 3 ఏంఎంసీ, 90.23 కిలోల పదార్థాలను దహనం చేశారు. జిల్లాలోని పటాన్‌చెరు స్టేషన్ పరిధిలో 10 కేసులు, సంగారెడ్డి స్టేషన్ పరిధిలో 7 కేసులు, నారాయణఖేడ్ స్టేషన్ పరిధిలో 3కేసులు, అందోల్ స్టేషన్ పరిధిలో 4 కేసుల్లో పట్టుబడిన మాదక ద్రవ్యాలలను అధికారులు ఈ సందర్భంగా కాల్చివేశారు. మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర హెచ్చరించారు.

కూల్చివేతలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అమీన్‌పూర్,జూన్ 3 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 947 శెట్టి కుంట ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు చేపట్టారంటు నాలుగు రోజుల క్రితం స్థానిక రెవెన్యూ అధికారులు కక్షపూరితంగా కేవలం పేదల ఇండ్లను కూల్చారని, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులకు చెందిన ఇండ్లను కూల్చలేదంటూ మంగళవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని బాధితులు కలిసి ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ నాయకులకు ఒక చట్టం, ఇతరులకు ఒక చట్టం ఉంటుందా అని బాధితులు ప్రశ్నించారు. పేదవాళ్ల ఇండ్లను కూల్చడం తగదన్నారు.

రేషన్.. పరేషాన్

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ షాపుల్లో జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను ఆదేశించిన సంగతి తెలిసిందే. జూన్ నెలంతా రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రేషన్ షాప్‌ల వద్దకు వినియోగదారులు క్యూకడుతున్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో సరుకులు పొందేందుకు కార్డుదారులు బారులు తీరారు. సర్వర్ డౌన్ కావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట (జూన్ 3)

సిద్దిపేటలోని రేషన్ షాప్ ముందు క్యూ

సిద్దిపేటలోని ఇంద్రానగర్ కాలనీలో సర్వర్ డౌన్ కావడంతో వినియోగదారుల పాట్లు

ఎన్‌సీసీతో ధృఢమైన వ్యక్తిత్వ నిర్మాణం

- ఎన్‌సీసీ క్యాడెట్లతో కల్నల్ రమేశ్ సరియాల్

పటాన్‌చెరు రూరల్, జూన్ 3: ఎన్‌సీసీతో ధృఢమైన వ్యక్తిత్వ నిర్మాణం జరుగుతుందని ఎన్‌సీసీ కల్నల్ రమేశ్ సిరియాల్ అన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్ ఆవరణలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిబిరం ముగింపు ఉత్సవాలకు మంగళవారం సంగారెడ్డిలోని 33(టీ) బెటాలియన్ ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేశ్ సరియాల్ హాజరై క్యాడెట్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలమైన వ్యక్తిత్వం, జాతీయ భావాలు ఈ క్యాంప్‌ద్వారా అలవరుతాయని తెలిపారు. ఐక్యత, క్రమశిక్షణ, స్థితిస్థాపకత విలువలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరిలో ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవితం విసిరే చాలెంజ్‌లను స్వీకరించి శారీరకంగా, మానసికంగాను ధృఢంగా మారి సక్సెస్‌ను సాధించాలన్నారు. గీతం సంస్థ అద్భుతమైన సౌకర్యాలను కల్పించిందని కొనియాడారు. దాదాపు 650మంది క్యాడెట్లు ఈ ఎన్‌సీసీ సమగ్ర శిక్షణ శిబిరంలో పాల్గొన్నట్లు తెలిపారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, అతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఎ.ఫిలిప్ హాజరై మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతిభను చాటిన క్యాడెట్లకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ రాంహరి గుల్జార్, కెప్టెన్ పి విజయ, లెఫ్టినెంట్ ఆర్ మహేందర్‌రెడ్డి, లెఫ్టినెంట్ యాదగిరి, జె.శంకరయ్య, గీతం ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్ ఎస్.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లనుద్దేశించి మాట్లాడుతున్న కల్నల్ రమేశ్ సరియాల్